# మొదటి అధ్యాయము

# దేవుడున్నాడా?

దేవుడున్నాడని హిందువులు చెప్పుదురు. దేవుడున్నాడని క్రైస్తవులును చెప్పుదురు. కాని నేను వేయకోరిన ప్రశ్న యేమనగా, "దేవుడున్నాడని యెట్లు రుజువుపర్చగలము?" అనునది. ఇది జీవిత ప్రకాశ పాఠశాలలో చదివిన ఒక వ్యక్తి వ్రాసినాడు. మీరు దీనికి ఏ జవాబిచ్చెదరు? ఈ ప్రశ్న మనకందరికి ముఖ్యమైనది. ఈ జీవితములో ఇది మనకు ముఖ్యమైన ప్రశ్న. తరువాత జీవితములో మరి ముఖ్యమైన ప్రశ్న. దేవుడుంటే మనము చేసిన ప్రతి క్రియ నిమిత్తము ఆయనకు లెక్క అప్పగించవలెను. దేవుడు లేకపోతే మనమేమి చేసినను ఎన్ని అబద్ధాలు ఆడినను, ఎన్ని అక్రమములు చేసినను, పర్వాలేదు. దేవుడు లేకపోతే లెక్క అప్పగించనక్కరలేదు. కనుక దేవుడున్నాడా? యను ప్రశ్న మన జీవితమునకు చాలా ముఖ్యమైనది. దేవుడున్నాడు అను మాటమీద యీ లోక నీతి యావత్తు ఆధారపడియున్నది. మరియు, మనము చనిపోయిన తరువాత మనము చేసిన ప్రతి క్రియ నిమిత్తము దేవునికి లెక్క అప్పగించ నక్కరలేదంటే, మనకు భయ భక్తులు ఉండవు. గనుక దేవుడున్నాడా? అను ప్రశ్నకు ఒకడు యిచ్చిన జవాబువలన యీ లోకనీతి యెడలను తరువాత లోకజీవితము యెడలను ఆయన అభిప్రాయ మెట్లుండునో తెలిసికొనగలము. మీ అభిప్రాయ మేమి? దేవుడున్నాడా? లేడా? దేవు డున్నాడని నమ్ముటకు మనకు ఎన్ని ఆధారములు ఎన్ని రుజువులు గలవు?

దేవుడు లేడని చెప్పువారు కలరు. గాని దేవుడు లేడను మాట చెప్పుటవలన దేవుడు లేడని రుజువుపర్చగలరా? వారి మాట రుజువా? దేవుడు లేడని నొక్కి చెప్పి ఆయనను లేకుండా చేయగలరా? దేవుని చూడలేదు కాబట్టి దేవుడు లేడని వారి వాదన. సరే, దీని విషయమై వారికి రెండు ప్రశ్నలు వేయుదుము. మొదటి ప్రశ్న ఏమనగా, "నీవు ప్రపంచమంత తిరిగి ప్రతి మూలలో దేవునికొరకు వెదకులాడి దేవుని చూడ కుండా వచ్చితివా? నీవు ప్రపంచమంతా ప్రతి నక్షత్రము కూడను దర్శించి వస్తేనేగాని దేవుడు లేడని నీవు చెప్పు మాట ఎట్లా నమ్మగలము?" దేవుడు లేడని చెప్పే మనిషి సూర్యుని దగ్గరకు పోయి సూర్యుని దగ్గర దేవుడు లేడని తెలిసికొని వచ్చినాడా? చంద్రుని దగ్గరకు పోయి చంద్రుని దగ్గర దేవుడు లేడని తెలిసికొని వచ్చినాడా? ఇట్లా ఆకాశంలో మనకు కనబడుచున్న ప్రతి నక్షత్రమును దర్శించి యీ నక్షత్రము దగ్గర దేవుడు లేడు, ఆ నక్షత్రము దగ్గర దేవుని చూడలేదని సాక్ష్యమిచ్చుటకు జ్ఞానము సంపాదించి వస్తేనేగాని వారి మాటెవరు నమ్మగలరు? దేవుడు లేడని చెప్పే మనుష్యులు

ఎంతవరకు పోయివచ్చినారు? ఏమి చూచి వచ్చినారు? సూర్యుడు మనకు ఎంత దూరములో ఉన్నాడు? 9,30,00,000 మైళ్ళ దూరములో ఉన్నాడు. యీ ప్రొద్దున మనము లేవగా సూర్యుడు ఉదయించినాడు. అప్పుడే సూర్యుడు ఉదయించినాడని అనుకొన్నాము. కాని అట్లా కాదు. ఆయన వెలుగు, మనకు కనబడక ముందు 8 నిమిషములకు ముందుగా సూర్యుని దగ్గరనుండి బయలుదేరినది. ఆ వెలుగు ఒక క్షణములో 186,000 మైళ్ళ దూరము నడుస్తూ మన దగ్గరకు చేరుటకు పరుగెత్తుతూ వచ్చినది. 1 నిమిషములో 60 క్షణములున్నవి. గనుక 1 నిమిషములో ఆ వెలుగు 1,11,60,000 మైళ్ళ దూరము నడిచినది. అంత దూరము నడచిన మాత్రాన మన దగ్గరకు చేరలేదు. ఆ వేగముతో వస్తూ వస్తూ 8 నిమిషములైన తరువాత మనకు సూర్యుని వెలుగు కనబడినది. మనము చూచి ఆహా అని సంతోషించి సూర్యుడు ఉదయించినాడని చెప్పితిమి. కాని నిజముగా 8 నిమిషములకు ముందుగా సూర్యుడు ఉదయించినాడు. అంత దూరములో సూర్యుడున్నాడు. ఎవరైనా అంత దూరము పోయి దేవుడు అక్కడలేడని తెలిసికొని చూచి వచ్చినారా? విజ్ఞానశాస్త్రమువలన మనుష్యులు విమానములలో ఈ భూలోకమును విడిచిపెట్టి సూర్యునితట్టు 15 మైళ్ళ దూరము పోయినారు. గాని 15 మైళ్ళు, 9,30,00,000 మైళ్ళలో ఎంతటి లెక్క? వీరేమి చూచి వచ్చినారు? దేవుడు లేడని వీరు చెప్పితే ఎట్లా నమ్మగలము? దేవుడు ఎక్కడున్నాడని మనము అడిగితే దానికి దేవుని వాక్యములో జవాబున్నది. "ఆయన భూమండలము మీద ఆసీనుడై యున్నాడు. దాని నివాసులు మిడతలవలె కనబడుచున్నారు. ఒకడు తెరను విప్పినట్లు ఆయన ఆకాశ వైశాల్యమును వ్యాపింపజేసెను. ఒకడు గుడారము వేసినట్లు ఆయన దీనిని నివాస స్థలముగా ఏర్పరచెను." (యెషయా 40:22).

మరియు సూర్యుని దగ్గర 12,000 డిగ్రీలు వేడిమియున్నది. ఆ వేడి మన దగ్గరకు చేరగా అది మన దేశములో 40 నుండి 120 డిగ్రీలవరకు ఉంటున్నది. ఎండా కాలములో 120 డిగ్రీలవరకు వేడి ఎక్కితే కొంతమంది సహించకలేక చనిపోవుచున్నారు. అట్లయితే సూర్యుని దగ్గర 12,000 డిగ్రీల వేడిమి యుండగా ఎవరు సూర్యుని దగ్గరకు పోగలరు? గాని సూర్యుని దర్శించి అక్కడ దేవుడు లేడని తెలిసికొని వస్తేనేగాని దేవుడు లేడని ఎట్లా రుజువుపర్చగలరు? ఇంకా సూర్యునికంటే చాలా ఎక్కువ దూరములో నక్షత్రములున్నవి. సూర్యుని వేడిమికంటే కొన్ని నక్షత్రముల దగ్గర మరీ ఎక్కువ వేడిగా నుండును. కొన్ని నక్షత్రముల లోపల 3,50,00,000 డిగ్రీల వేడిగా నుండును. యీ వేడి ఎవరు సహించగలరు? గనుక దేవుని వాక్యములో ఏమున్నదంటే "సమీపింప రాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు; ఆయనకు ఘనతయు శాశ్వతమైన ప్రభావమును కలిగియుండునుగాక." (1 తిమోతి 6:16).

పైన వేయబడిన మొదటి ప్రశ్న ఏమనగా :- "నీవు ప్రపంచమంతా తిరిగి ప్రతి మూలలో దేవునికొరకు వెదకులాడి, దేవుని చూడకుండా వచ్చితివా?" అనునది. దాని విషయము కొద్దిగా వివరించినాము. "దేవుని చూడలేదు కాబట్టి దేవుడు లేడ"ని చెప్పే మనుష్యులకు మనము వేయతగిన రెండవ ప్రశ్న ఏమనగా - "నీకుండే ఆత్మను చూచితివా? చూడకుండా పోయినంతమాత్రాన నీకు ఆత్మలేదని చెప్పుదువా? నీవు మరి ఒక వ్యక్తియెడల లేక నీ బిడ్డలయెడల ప్రేమ కలిగియున్నప్పుడు ఆ ప్రేమను చూచితివా? ఆ ప్రేమను చూడకపోయిన మాత్రాన ప్రేమ లేదని చెప్పుదువా?" ఎవడును ఆత్మను చూడలేదు. విజ్ఞానశాస్త్రులు శవములను కోసి ఎముకలు, కండలు, చలన నాడులు, జ్ఞాననాడులు, గుండె క్రొవ్వు, ఊపిరితిత్తులు మొదలగునవి శరీరములోని అవయవములన్నియు పరీక్షింపగా వారికి ఆత్మ కనబడలేదు. ఒకవేళ అప్పుడు ఆత్మ వెళ్ళిపోయెనని అనుకొనవచ్చును. గనుక ఒక వ్యక్తి జీవించుచుండగా విజ్ఞానశాస్త్రులు మంచి యంత్రములతో ఎక్స్ రే ఫొటోలు తీసినను వారికి ఆత్మ కనబడలేదు. ఆ ఎక్స్ రే ఫొటోలో విరిగిపోయిన యెముక ఉంటే అది కనబడుతున్నది. ఊపిరితిత్తులలో క్షయరోగము గలవారికి క్షయరోగ సూక్ష్మజీవులు కనబడును. మరియు ఆ ఎక్స్ రే ఫొటోలో శరీరములోని అవయవములన్నియు కనబడును. కాని ఆత్మ ఎవరికిని ఎన్ని యంత్రములు పెట్టి చూచినను కనబడదు. ఈ శరీరములో నివసించుచు శరీరమునకు వేరుగా అవయవములను నడిపించు ఆత్మ ఉన్నదని మానవకోటి కంతటికిని తెలుసును. ఎట్లా తెలుసును? మరి చూడలేదుగా?

మూడు కారణములవలన ఆత్మ శరీరమునకు వేరుగా జీవించుచున్నదని మనము స్థిరపరచుకొనగలము. (1) ఒక మనిషి పనిమీద యుండగా వెలుపల ఫుట్‌బాల్ ఆడు కొనుచున్నప్పటికి, ఒక తమాష జరుగుచున్నప్పటికిని, ఆ మనిషి పని విడిచిపెట్టక తన మనస్సు పనిమీద నిలిపినాడంటే తాను చేయవలసిన పనిచేసి తీరవలెనని తనలోని ఆత్మ నిశ్చయించుకొన్నట్లు కనబడును. శరీరరీతిగా యెన్నో ఆకర్షణీయముల వలన యిటు అటు లాగబడినను ఒక మనిషి వాటన్నిటిని లక్ష్యపెట్టక తన కేర్పరచబడిన పని చేసి ముగించినట్లయితే తన శరీరమునకు వేరుగా నుండి తన శరీరమును నడిపించు నట్టి, తన శరీరములో నివసించునట్టి ఆత్మ యున్నదని మనము గుర్తెరుగ గలము.

(2) ఈ శరీరములో నివసించుచున్న ఆత్మ మరియొక పని చేయును. ఈ నిమిషము ఒక సంగతిని గూర్చి ఆలోచించుచు ఒక క్షణములోపల ఆ సంగతి పూర్తిగా విడిచి పెట్టి మరియొక వేరే క్రొత్త సంగతిని గూర్చి ఆలోచించుటకు మొదలుపెట్టును. మరి యొక క్షణములో పూర్వపు సంగతి మరల యెత్తి ఆలోచించుటకుగాని మరియొక ఏదైనా క్రొత్త సంగతిని యెత్తి ఆలోచించుటకుగాని మొదలుపెట్టును. ఒక గంటసేపు

శరీర రీతిగా కూర్చునియుండగా ఒక మనిషి యిట్లు నూరు క్రొత్త సంగతులు ఒకదాని వెంబడి యొకటి వరుసగా యెత్తి ఆలోచించవచ్చు. ఈ శక్తినిబట్టి శరీరమునకు వేరుగా నుండి శరీరములో ఆత్మ నివసించుచున్నదని స్పష్టమగుచున్నది.

(3) పాత సంగతులను క్రొత్త సంగతులను సమకూర్చి ఆలోచించి క్రొత్త తీర్మానము యిదివరకెవ్వరు చేయని తీర్మానము చేయు శక్తి మనకున్నందువలన వినుశక్తి ద్వారాను, చదువుశక్తి ద్వారాను, చూచే శక్తిద్వారాను అనేక సంగతులు తెలిసికొని జ్ఞప్తియందుంచు కొని ఆలోచించి క్రొత్త తీర్మానము యిదివరకెవ్వరు చేయని తీర్మానము చేయు శక్తి మనకున్నందువలన మన శరీరమునకు వేరుగా నుండి శరీరములో నివసించుచు ఆత్మ యున్నదని గుర్తెరుగ గలము.

మన శరీరములో ఆత్మయున్న ప్రకారముగా, లోకములో దేవుడున్నాడు. ఎవడు ఆత్మను చూడలేదు. ఎవడు దేవుని చూడలేదు. గాని ఆత్మచేయు పనులవలన ఆత్మ యున్నదని స్పష్టమగుచున్నది. అట్లనే దేవుడు చేయుచున్న పనివలన దేవుడున్నాడని తెలిసికొనుచున్నాము. దేవుని చూడలేము కాబట్టి దేవుడు లేడను మాట యుక్తమైనది కాదు. ప్రేమను కూడా ఎవడును చూడలేదు కాబట్టి లోకములో ప్రేమ లేదనుట సరి యైనదా? సరికాదని మీరు చెప్పుదురు. ప్రేమయొక్క పొడుగు, ప్రేమయొక్క వెడల్పు, ప్రేమయొక్క లోతు, ఎవరైనను కొలచినారా? నీకు తెలిసినంత వరకు ప్రేమయొక్క పొడుగు, వెడల్పులు ఎవరైనా కొలచినట్లయితే ఆ కొలతలను మాకు పంపగలరా?

కొలువక పోయిన మాత్రాన, చూడక పోయిన మాత్రాన లోకములో ప్రేమ లేదని చెప్పుదురా? అట్లాగే దేవుని జూడకపోయిన మాత్రాన దేవుడు లేడని చెప్పుదుమా? అది యుక్తము కాదు.

## దేవుడున్నాడనుటకు ఆధారములు

పైన వేయబడిన రెండు ప్రశ్నలకు జవాబులు కనుగొనగా, దేవుడు లేడను మాట యుక్తము కాదని తేల్చితిమి. ఇప్పుడు ఏడు ఆధారములద్వారా దేవుడున్నాడని విశద పర్చబోతున్నాము. అవేవనగా :-

**1. మానవునిలోని మనస్సాక్షి. 2. సృష్టి. 3. దేవుని వాక్యము. 4. చరిత్రలో నెర వేరిన ప్రవచనములు. 5. దేవుని ధర్మశాస్త్రమునకు విరోధముగా పాపము చేసి నాశన మైన వ్యక్తులును, రాజ్యములును. 6. దేవునియందు విశ్వసించినవారి అనుభవములు. 7. యేసుక్రీస్తే.**

ఈ ఏడు ఆధారములను ఆలోచించుటకు సిద్ధముగా నున్నాము. ఈ ఏడు ఆధార ములు ఏకీభవించి దేవుడున్నాడని స్థిరపర్చుచున్నవి. వీటి నొక్కొక్కటిగా ఆలోచించి

నట్లయితే కొంతవరకు నమ్మకము గలుగ వచ్చును. కాని యివన్నియు వరుసగా ఆలోచించినట్లయితే దేవుడు లేడని రుజువుపరచుటకంటె దేవుడున్నాడని రుజువు పరచుట సులభమని ఒప్పుకొనక తప్పదు.

1. మనము ఎక్కడ చూచినా ప్రతి నరునిలో మనస్సాక్షి ఉన్నట్లు కనబడుచున్నది. సముద్రములలో ఒక చిన్న లంక మీద జీవించుచున్న జ్ఞానములేని పామరుల దగ్గరకు పోయినను ఎక్కువ నాగరికతగల విద్వాంసుల దగ్గరకు పోయినను "అబద్ధమాడ వచ్చునా? వ్యభిచరింపవచ్చునా? దొంగిలింప వచ్చునా?" అని మనమడిగితే, వారు అవి చేయరాదని చెప్పుదురు. ఒకవేళ పామరులకు విద్యలేదు, నాగరికత లేదు, ధర్మశాస్త్రము లేదు గాని, కొన్ని పనులు చేయరాదని వారు చెప్పుదురు. ఈ జ్ఞానము వారికి ఎట్లా వచ్చినది? వారిలోని మనస్సాక్షి వలన వారికి ఈ జ్ఞానము వచ్చినదిగదా? "అట్టివారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒక దానిమీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్రసారము తమ హృదయములయందు వ్రాయబడినట్టు చూపుచున్నారు" (రోమా 2:15). మానవుని హృదయములలో ధర్మశాస్త్రసారము వ్రాసినదెవరు? ధర్మశాస్త్ర కర్తగదా? మనలోని మనస్సాక్షి "ఇది సరి; అది సరికా"దని చెప్పుటతో తృప్తిపడుట లేదు. మనలను తీర్పు లోనికి తెచ్చుచున్నది. దాని శబ్దమును మనము అణచి పెట్టలేము. అది ఊరుకొనదు. అది మనయందు దోషారోపణ చేయు మనస్సాక్షి ప్రతి మనిషిలో ఉన్నందువలన ధర్మ శాస్త్ర కర్తయు న్యాయాధిపతియైన ఒకడు మనపై నున్నాడని స్పష్టమగుచున్నది.

మనస్సాక్షి ప్రతి తరుణమునందు సరియైన తీర్పు తీర్చునని భావము కాదు. ప్రతి మనిషి మనస్సాక్షి వారిని వేర్వేరు రీతులుగా నడిపించునుగాని, అందరి మనస్సాక్షి ఒకేరీతిగా నడిపించదు. పరిసర మార్పులవలనను, పారంపర్య భేదములవలనను, విద్యా భేదములవలనను, ఒకరి మనస్సాక్షి యొక విధముగా చెప్పును. మరియొకరి మనస్సాక్షి మరియొక విధముగా చెప్పును. ఒకరి మనస్సాక్షికి పొగత్రాగుట తప్పుగా నుండదు. గాని మరియొకరి మనస్సాక్షికది తప్పుగా నుండును. మనస్సాక్షి పరిసరముల నుండిగాని, పారంపర్యముల నుండిగాని, విద్యనుండిగాని పూర్తిగా స్వేచ్ఛను పొంద లేదు. మనస్సాక్షి కొన్ని సమయములందు చురుకుగాను, మరికొన్ని సమయములందు మందముగాను నుండును. కొంతమంది మనస్సాక్షి యెర్రగా కాలిన యినుముతో వాతవేయబడిన దానివలె నుండును. క్రీస్తును తమ రక్షకుడని నమ్మనటువంటి కొందరి మనస్సాక్షి, క్రైస్తవ బోధన వలనగాని, నీతివలనగాని వెలిగింపబడవచ్చును. అది యే విధమైనటువంటి మనస్సాక్షియైనప్పటికీ ప్రతి మానవుని కొక మనస్సాక్షి యున్నది. ఆ మనస్సాక్షి మానవుడు తాను చేయు కార్యములనుబట్టి హెచ్చరిక చేయుచు నిందిం

చుచు, న్యాయము తీర్చుటయేకాక లోకములో తన కార్యములకు న్యాయాధిపతియు ధర్మశాస్త్ర కర్తయునగు వ్యక్తి తాను బాధ్యుడై యున్నాడని తెల్పుచున్నది.

2. దేవుడున్నాడని సృష్టికూడా చెప్పుచున్నది. నా చేతిలో ఒక గడియారము ఉన్నదంటే, దానిని చేసిన మనిషి ఒకడు ముందున్నాడని అందరు ఒప్పుకొందురు. అట్లనే ఈ సృష్టియావత్తును మనము చూచుచుండగా దీనివెనుక సృష్టికర్త ఒకడున్నాడని స్పష్టమగుచున్నది. "దేవునిగూర్చి తెలియ శక్యమైనదేదో అది వారిమధ్య విశదమైయున్నది; దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి" (రోమా 1:19,20). సృష్టిద్వారా దేవుని ప్రేమ విషయము తేటగా తెలిసికొనలేము. భూకంపముల వలనను వరదలవలనను, కరువులవలనను, ఆయన కోపము గలవాడని కనబడును. కాని సృష్టిద్వారా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును తేటపడుచున్నది. సృష్టికర్తను సృజించిన మరియొక సృష్టికర్త వెనుకుండవచ్చునేమో అని మీరు సందేహపడవచ్చును. సృష్టిద్వారా ఈ సందేహము తీర్చలేము. గాని సృష్టికర్త అను ఒకడున్నాడని స్పష్టమగుచున్నది. అంతవరకు స్థిరపరచినాము.

మరియు మన భూలోకము సూర్యుని చుట్టు గంటకు 64,800 మైళ్ళ వేగముతో తిరుగుచుండగా ఇంకా అనేక నక్షత్రములు యనేక చుక్కలు కూడా సూర్యుని చుట్టు తిరుగుచున్నవి. భూలోకము చుట్టు చంద్రుడు తిరుగుచున్నాడు. ఇవి అన్నియు ఆకాశములో తిరుగుచుండగా ఒక దానిమీద ఒకటి పడకుండా ప్రతిది తనకు ఏర్పరచబడిన దారిలో నడుచుచున్నందువలన వెనుక ఆధారభూతుడు ఒకడు ఇది అంత త్రిప్పుతున్నాడని స్పష్టమగుచున్నది. మన భూలోకము సూర్యునికి ఇంకా దగ్గరలో ఉంటే ఆ వేడి వలన మన జీవనోపాయమునకు ముఖ్యముగా కావలసిన నీళ్ళు ఆవిరి రూపముగా మారును. మనము కూడా ఆ యెండ సహించలేక చనిపోవుదుము. మన భూలోకము సూర్యునికింకా దూరములో నుంటే నీరు గడ్డకట్టును మనము కూడ ఆ చలి సహించలేక పోవుదుము. సూర్యుని దగ్గరనుండి బయలుదేరిన 12,000 డిగ్రీల వేడిమి మనుష్యులకు సరిపోవలెనంటే ఈ భూలోకము సరియైన దూరములో ఉండవలెను గదా? అది ఎవరిచేత కలుగుచున్నది? భూలోకము తనంతట తానే ఇది కలుగచేయునా? గడియారము తనంతట తానే అవుతుందా? నరులు నివసించుట కొరకు భూలోకమును సృజించి సూర్యునికిని, భూలోకములకును మధ్య ఎంత దూరముండవలెనో దాని గుర్తెరిగి తగురీతిగా సృజించినది సృష్టికర్తయేగదా? గనుక సృష్టినిబట్టి చూస్తే దేవుడున్నాడని కనబడుచున్నది.

3. దేవుడున్నాడని దేవుని వాక్యముకూడ బయలుపర్చుచున్నది. దేవుని వాక్యములో రెండు వేలకంటె మరి యెక్కువసార్లు "యెహోవా సెలవిచ్చుచున్నాడు" లేక "సైన్యముల

కధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చెను" అను వాక్యములు వ్రాయబడియున్నవి. యెహోవా దేవుడు లేకపోతే వారు రెండు వేలసార్లు చెప్పిన మాట అబద్ధమే. దేవుడున్నాడు కాబట్టి వారు ఈలాగు చెప్పిరి. దేవుని వాక్యములో 66 గ్రంథములు ఉండగ 40 మంది ప్రవక్తలును, దైవసేవకులును దీనిని వ్రాసిరి. క్రీస్తుకు ముందు 1400 సం॥ల ముందుగా మోషే పంచగ్రంథములు మొదటిగా వ్రాసెను. క్రీస్తు తరువాత 100 సం॥లకు యోహాను ప్రకటన గ్రంథము ఆఖరుగా వ్రాసెను. అట్లయితే వారి మధ్య కాలములో 1500 సం॥లలో 40 మంది దైవసేవకులు ఈ 66 గ్రంథములు వ్రాసిరి. వారి పరిస్థితులు యెంత వేరుగా ఉండినను, వారి కాలములు ఎంత వేరుగా ఉండి నను, వారు ఏక భావముతో ఒకరు మరియొకరి భావములను చెడగొట్టకుండా, ఒకరు మరియొకరికి వ్యతిరేకముగా వ్రాయకుండా దేవుని విషయమైన సంగతులను తెలియ జేసిరి. దీనినిబట్టి మనము ఆలోచించినట్లయితే ఈ 40 మంది గ్రంథకర్తల వెనుక ఒకే ఒక్క గ్రంథకర్త అనగా దేవుడున్నాడని స్పష్టమగుచున్నది.

రాజులు ఈ వాక్యముమీద పగపెట్టుకొని దీనిని కాల్చివేసిరి. ప్రజలు దీనిని త్రొక్కి నాశనము చేయుటకు ప్రయత్నము చేసిరిగాని వారిచేత కాలేదు. వారు దీనిని యెంతగా నాశనము చేయదలచిరో అంతగా ఇది అభివృద్ధి చెందుచున్నది. ఎందుకంటే దేవుడు తన విషయము సాక్ష్యమిచ్చుటకు ఆ వాక్యమును ఈ లోకములో పెట్టి కాపాడుచున్నాడు.

4. చరిత్రలో నెరవేరిన ప్రవచనముల వలన దేవుడున్నాడనియు, దేవుని వాక్యము నమ్మదగినదనియు రుజువగుచున్నది. మీరు రూపాయి నాణెములు పది తీసికొని ఒక్కొక్క దానిమీద 1,2,3,4,5,6,7,8,9,10 అను సంఖ్యలు వ్రాసి మరల మీ జేబులో వేసికొనుడి. ఇప్పుడు ఇవి అన్ని వరుసగా ఒకటి నుండి 10 వరకు తీయమంటే వీలు పడునా? ఒక వేళ అదృష్టమువలన మొదటిది మొదటిదిగా తీయవచ్చును. గాని, రెండవది రెండవదిగా తీయుట మరీ కష్టము. మూడవది మూడవదిగా తీయుట మరీ మరీ దుర్లభము. నాల్గవది నాల్గవదిగా తీయుట అసాధ్యము. ఇంకా అన్ని వరుసగా తీయుట కేవలము అసాధ్యము. అలాగే ఒకవేళ ఒకడు రాబోయే వాటి విషయము అదృష్టమువలన ఊహించి ఒక్క సంగతి సరిగా చెప్పవచ్చు, రెండవ సంగతి ప్రవచిం చుట మరీ కష్టము. మూడవ సంగతి ప్రవచించుట మరీ మరీ దుర్లభము. నాల్గవ సంగతి మానవుని జ్ఞానముతో ప్రవచించుట అసాధ్యము.

ప్రస్తుత కాలమందు యాభైయేండ్లు అయిన తరువాత ఏ రాజ్యము పైకి వస్తుందో ప్రవచింపగలరా? దేవుని వాక్యములో ప్రవక్తలు రాజ్యములను గూర్చి ప్రవచించిన ప్రవచనములన్నియు ఎట్లా నెరవేరినవో ఇక్కడ విశదపర్చుటకు స్థలము లేదు. ఒక్కటి మాత్రము దృష్టాంతముగా చూపించుచున్నాను. దానియేలు క్రీస్తుకు ముందు 534 సం॥లో గ్రీకు రాజ్యము చాల చిన్నదై యుండగ రోమా రాజ్యము యింకా కనబడకముందే

తన ప్రస్తుత కాలమందున్న పారసీక రాజ్యము చాలా మహిమా ఐశ్వర్యములతో ప్రకాశించుచుండగా "ఇంకా ముగ్గురు రాజులు పారసీకము మీద రాజ్యము చేసిన పిమ్మట అందరికంటె అధికైశ్వర్యము కలిగిన నాల్గవ రాజొకడు వచ్చును. అతడు తన కున్నసంపత్తుచేత బలవంతుడై అందరిని గ్రేకేయుల రాజ్యమునకు విరోధముగా రేపును" అని ప్రవచించెను. (దానియేలు 11:2), దానియేలు గ్రంథము 2,7,8,11 అధ్యాయము లను మీరు చదివినట్లయితే పారసీక రాజ్యము తరువాత రాబోయే గ్రీకు రాజ్యము, దాని తరువాత రోమా రాజ్యము దాని కాలములో రావలసిన దేవుని రాజ్యమును గూర్చి దానియేలు ప్రవచించెనని తెలిసికొనవచ్చును. క్రీస్తుకు ముందు 333 సం॥న గ్రీకు రాజ్యము పైకి వచ్చినది. క్రీస్తుకు ముందు 63వ సం॥లో రోమా రాజ్యము పైకి వచ్చినది. దాని కాలములో యేసుక్రీస్తు దేవుని రాజ్యమును స్థాపించెను. దానియేలు ఇది అంతయు 500 సం॥లకు ముందుగా ప్రవచించినాడంటె అర్థమేమి? ఏమనగా అన్ని కాలములు ఎరిగిన యెహోవా దేవుడున్నాడనియు, ఆ దేవుడు దానియేలు చేత ఆ వాక్కులు పలికించెననియు అర్థమిచ్చుచున్నది.

ఒకటినుండి పదివరకు మీరు ఆ పది నాణెములు మీ జేబులో నుండి వరుసగా తీయుటకు సాధ్యము కాదని పైన ఒప్పుకొన్నారు. పదిమంది తీసినగాని మరల సులభ మవుతుందా? ఆ పదిమంది వేర్వేరు స్థలములలో ఆ పది నాణెములను తీసిన యెడల, వరుసగా తీయుటకు యేమైనా సాధ్యమవుతుందా? గాని చాలామంది ప్రవక్తలు వేర్వేరు కాలములలో వేర్వేరు స్థలములలో బ్రతికి యేసుక్రీస్తును గూర్చి చెప్పిన మాటలు వరుసగా నెరవేరినవి. యేసుక్రీస్తు ఈ లోకములో జీవించుచుండగా తన జీవితములోని ఆఖరు ఇరువది నాలుగు గంటల కాలములో నెరవేరిన పదిహేను ప్రవచనములు యిప్పుడు లెక్కించెదము :

1. స్నేహితునివలన అప్పగింపబడెను. కీర్తనలు 41:9; మత్తయి 26:14-16.
2. ముప్పది వెండి రూకలకు అప్పగింపబడెను. జెకర్యా 11:12; మత్తయి 26:15.
3. ఆ రొక్కముతో కుమ్మరివాని పొలము కొనిరి.
   జెకర్యా 11:13; మత్తయి 27:6,7.
4. అబద్ధ సాక్షులు ఆయన మీద నిందమోపిరి.
   కీర్తనలు 27:12; మత్తయి 26:60-61.
5. ఆయన మౌనముగా ఉండెను. యెషయా 53:7; మత్తయి 26:62-63.
6. వారాయన మీద ఉమ్మివేసిరి. యెషయా 50:6; మార్కు 14:65.
7. ఆయన మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను.
   యెషయా 53:5; మత్తయి 27:42.

8. పాపులతో సిలువ వేయబడెను. యెషయా 53:12; మత్తయి 27:38.
9. ఆయన కాళ్ళను చేతులను పొడిచిరి. కీర్తనలు 22:16; యోహాను 20:27.
10. ఆయన తృణీకరింపబడెను. కీర్తనలు 22:6-8; మత్తయి 27:39-40.
11. త్రాగుటకు చిరక నిచ్చిరి. కీర్తనలు 69:21; యోహాను 19:28.
12. ఆయన ప్రక్కను కూడా పొడిచిరి. జెకర్యా 12:10; యోహాను 19:34.
13. కాని ఒక ఎముకైననూ విరువబడలేదు.
నిర్గమ 12:46; కీర్తనలు 34:20; యోహాను 19:33.
14. ఆయన వస్త్రముల కొరకు చీట్లు వేయబడెను. కీర్తనలు 22:18; మార్కు15:24.
15. భాగ్యవంతుల సమాధిలో పెట్టబడెను. యెషయా 53:9; మత్తయి 27:57-60.

ఈ పదిహేను ప్రవచనములు మాత్రమే కాక అనేక ప్రవచనములు యేసుక్రీస్తు కాలములో నెరవేరినవి. కాని అవి అన్ని యిక్కడ వ్రాయలేము. వేర్వేరు కాలములలో వేర్వేరు ప్రవక్తల ద్వారా పలికింపబడిన ఈ ప్రవచనములు, వరుసగా ఒక మనిషి జీవితములో 24 గంటల సేపులో నెరవేరినవంటే అర్థమేమి? ఏమనగా దేవుడు తన ప్రవక్తలచేత ప్రవచనములు పలికించి వాటిని నెరవేర్చుటకు లోక చరిత్ర అంతా జరిగించుచున్నాడు. ప్రవచనములు నెరవేరినందువలన దేవుడున్నాడని రుజువగుచున్నది.

5. దేవుడున్నాడని ఆయన ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా పాపము చేసి నాశనమైపోయిన వ్యక్తులవలన, రాజ్యములవలన సాక్ష్యమియ్యబడుచున్నది. నోవహు కాలమందు "నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయముయొక్క తలంపుల లోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను" (ఆది. 6:5-6). వారందరు జలప్రళయములో నాశనమై పోయినారంటే ఒకటే ఒక్క సంగతి తేలుచున్నది. ఏదనగా దేవుని ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా నున్నందువలన ఆయన ఆత్మ వారితో ఎల్లప్పుడును వాదించక వారిని నాశనమునకు అప్పగించెను.

భూలోక చరిత్రను చూస్తే 10 గొప్ప రాజ్యములు లేచి కొంత కాలము పరిపాలన చేసి పడిపోయినవి. అవేవనగా, 1. అషూరియా, 2. ఐగుప్తు, 3. బబులోను, 4. ఇశ్రాయేలు, 5. భరత, 6. పారసీక, 7. గ్రీకు, 8. రోమా, 9. బ్రిటీష్, 10. జర్మనీ. ఆరంభములో ఈ రాజ్యములన్నీ మహిమా ఐశ్వర్యములతోను, నాగరికతతోను, జ్ఞానముతోను, పరిపాలన చేయుచుండెను. బబులోను రాజు నగరములు, గోపురములు అన్నిటికంటె ఉన్నతమైనవిగా ఎంచబడెను. బబులోను రాజ్యము నిరంతరము చాటింపబడెను. గాని ఆ రాజ్యములో పాపము వ్యాపించి పోయినది. ఒక రాత్రి వారి రాజును, వారును

కల్లు త్రాగి మత్తులై యుండగా పారసీక సైన్యము వారి ముఖ్య పట్టణములో ప్రవేశించి వారిని జయించి వారి దేశమును ఆక్రమించుకొనెను. గ్రీకు రాజ్య చరిత్ర కూడా యిలాంటిది. రోమా రాజ్య చరిత్ర కూడా యిలాంటిదే. "రోమా రాజ్యము లేచి పడి పోవుట" అను ఆరు గ్రంథములు వ్రాసిన గిబ్బన్ అను చరిత్రకారుడు రోమా రాజ్యము పడిపోవుటకు 5 కారణములు కలవని తెలియజేసెను. అవేమనగా 1. పరిత్యాగ పత్రిక యిచ్చి కుటుంబము యొక్క పవిత్రత చెడగొట్టుట వారికి అలవాటయినది. 2. లౌకిక వినోదములను ఆశించిరి. 3. వారి దేశములో వారి నిజమైన శత్రువున్నాడని గమనించ కుండా బయట నుండి వచ్చే శత్రువులకు భయపడి తమ్మును తాము కాపాడుకొనుటకు గొప్ప గొప్ప ఆయుధములను, రథములను చేసికొని చాలా ద్రవ్యము వ్యర్థముగా ఖర్చు పెట్టిరి. 4. ప్రజలు బలహీనులై పోయిరి. 5. ఏక దేవుని అరాధించకుండ అన్య దేవతలకు ధూపము వేస్తూ మతభ్రష్టులైరి.

పై నుదహరింపబడిన 10 రాజ్యముల చరిత్ర చూస్తే వాటన్నిటిదీ ఒకటే కథగా నుండును. దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది. రోమా 1:18. భరత రాజ్యమును కూడ చూస్తే రెండు వేల సంవత్సరముల క్రిందట ఏక దేవుని ఆరాధించుచు చాలా మహిమైశ్వర్యములతో కూడినదైయుండెను. వేదములలో ఏక దేవుని ఆరాధన నేర్పింపబడియుండినను క్రమేణ విగ్రహారాధన ఆ రాజ్యములో ప్రవేశించి పాడుచేసెను. ప్రారంభ మహిమైశ్వర్యములు పోగొట్టుకొనుటకు విగ్రహారాధన కారణమైనది. వారు ఆ మహిమైశ్వర్యములను పోగొట్టి 7 మెట్లు దిగజారిరి. 1. దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు. 2. కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు. 3. వాదములయందు వ్యర్థులైరి. 4. వారి అవివేక హృదయము అంధకారమయ మాయెను. 5. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. 6. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యులయొక్కయు, పక్షులయొక్కయు, చతుష్పాద జంతువులయొక్కయు, పురుగులయొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి. 7. తమ హృదయముల దురాశలను అనుసరించి తమ శరీరములను పరస్పర అవమానపరచు కొనునట్లు దేవుడు వారిని అపవిత్రతతకు అప్పగించెను. రోమా 1:21-24. ఇట్లు ప్రతి వ్యక్తి, ప్రతి రాజ్యము దేవుని విడిచిపెట్టి ఆయన ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా నడచి ఆయన ఉగ్రత ననుభవించి నాశనమై పోవుచుండగా దేవుడున్నాడని సాక్ష్య మిచ్చుచు వెళ్ళిపోయెను.

6. దేవుడున్నాడని ఐదు ఆధారములను పరీక్షించితిమి. ఇప్పుడు ఆరవ ఆధారమును చూడబోతున్నాము. అది యేదనగా దేవునియందు విశ్వాసముంచిన వారి అనుభవములు.

ఇది చాల ఉత్తమమైన రుజువు. ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయగోరినయెడల ఆ బోధ దేవునివలన కలిగినదో లేదో వాడు తెలిసికొనునని (యోహాను 7:17) మనము జ్ఞాపకము చేసికొనవలెను. దేవునియందు విశ్వాసముంచినవారు తమ అనుభవముద్వారా దేవుడున్నాడని తెలిసికొందురు. ఎలక్ట్రిక్ తీగె ఒకడు తాకిన తరువాత దాని శక్తి అనుభవించిన తరువాత దానిలో శక్తిలేదని ఎవడైన చెప్పినయెడల దాని శక్తి అనుభవించినవాడు నమ్ముతాడా? దాని శక్తి అనుభవించకుండా దానిలో శక్తిలేదని ఒకడు చెప్పవచ్చును. ఎందుకంటె తనకు అనుభవము లేదు. అనుభవము గలిగినవారి మాట నమ్ముతామా? లేక అనుభవము లేనివారి మాట నమ్ముతామా? దేవుడు లేడని ఒకడు చెప్పినయెడల తనకే దేవుడు లేడని రుజువు పర్చుచున్నాడు. గాని యితరులకు దేవుడు లేడని అతడు రుజువు పర్చజాలడు.

నా తల్లి చనిపోయిన తరువాత కొన్ని మాసములవరకు నాలో ప్రాణము లేనట్టయినది. నేను క్రైస్తవుడను. క్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడై సర్వకాలము జీవించుచున్నాడను సిద్ధాంతము అంగీకరించినవాడను, ఈ సిద్ధాంతమును నమ్మి బోధించినాను. గాని నా తల్లి చనిపోకమునుపు క్రీస్తు పునరుత్థానము నాకు అర్థములేని వట్టి సిద్ధాంతమే. నా అమ్మ చనిపోయిన తరువాత కొన్ని మాసముల వరకు నేనుకూడ చనిపోయినవానిగా జీవించితిని. ఆ రోజులలో క్రీస్తు పునరుత్థానమను సిద్ధాంతము నాకు బహు ప్రీతికరమై యుండినది. గాన అప్పుడు నాకు క్రొత్త అనుభవము కలిగినది. ఇంతకు ముందు ఈ సిద్ధాంతము నమ్మతగిన సిద్ధాంతమైనను నాకు వట్టి సిద్ధాంతమై యుండినది. రాత్రింబగళ్ళు తల్లి మరణ విషయమును క్రీస్తు పునరుత్థాన విషయమును దీర్ఘముగా ఆలోచించుచునుండగా నాకు క్రొత్త యనుభవము కలిగినది. క్రీస్తు జీవించుచున్నాడని అనుభవించి, నా అమ్మకూడా జీవించుచున్నదని తెలుసుకొని నేను తరువాత క్రీస్తును, క్రీస్తుతో కూడా నా అమ్మను కలిసికొంటానని నమ్మి చాలా శాంతి పొందితిని, ఈలాంటి శాంతి అనుభవించిన తరువాత దేవుడు లేడనియు క్రీస్తు జీవించుట లేదనియు నొకడు చెప్పినయెడల నమ్ముతామా? నమ్మము. దేవునియందు విశ్వసించినవారి అనుభవము దేవుడున్నాడని వారికి సాక్ష్యమిచ్చుచున్నది.

7. దేవుడున్నాడని రుజువుపర్చుటకు ఇప్పుడు ఏడవ ఆధారమును గురించి ఆలోచించుటకు సిద్ధముగా నున్నాము. ఆరు మెట్లు ఎక్కినట్లున్నది. పైన ఉదహరింపబడిన ఆరు ఆధారములు మంచివేగాని వాటికంటే ఈ ఏడవ ఆధారమునకు వర్ణింప లేనంత శ్రేష్ఠత కలదు. యేసుక్రీస్తే దేవుడున్నాడనుటకు ఉత్తమమైన రుజువు. ఈ పాపలోకములో ఒకడు పాపము చేయకుండా, పాపము తలంచకుండా జీవించినాడంటే దైవశక్తి ఆయనలో సంపూర్ణమైనదన్నమాట. యేసుక్రీస్తు అన్ని విషయములలో మనవలెనే

శోధింపబడినాడు. అనగా దొంగతనము విషయములోను, వ్యభిచారము విషయములోను ప్రతి పాప విషయములోను ఆయనకు కూడా శోధన కలిగినది. కాని ఆయన పాపము లేనివాడుగా జీవించెను. ఈ పాపలోకములో దేవుని సహాయము లేకుండా ఒకడాలాగు జీవింపగలడా? యేసు పవిత్ర జీవితమువలన దేవుడున్నాడని మనము చూడగలము.

మరియు దుర్మార్గులు ఆయనమీద లేచి కొట్టి, తిట్టి, నెట్టి, చివరకు చంపినను ఆయన నోటనుండి ఒక దూషణ మాటయైనను రాలేదు. గాని "తండ్రీ! వీరేమి చేయు చున్నారో వీరికి తెలియదు కాబట్టి వీరిని క్షమించుము" అని ప్రార్థించెను. దీనినిబట్టి మనము ధ్యానించినట్లయితే యీయనలో దైవశక్తి బయలుపర్చబడెనని యొప్పుకొనక తప్పదు. ఇంకొక శ్రేష్ఠమైన మాట ఆలోచించెదము. యేసుక్రీస్తు చనిపోయి మూడు రోజులైన తర్వాత మృతులలో నుండి లేచెను. క్రీస్తునందు యీలాగు వినియోగపర్చ బడిన బలాతిశయమునుబట్టి మనము తలపోసినట్లయితే దేవుడున్నాడని ఒప్పుకొనక తప్పదు. ఇది ఆఖరు రుజువు. మనము ఈ అధ్యాయములో దేవుడున్నాడని రుజువుపర్చు టకు ఏడు ఆధారములను ఆలోచించితిమి.

1. ధర్మశాస్త్రకర్తయు న్యాయాధిపతియునైన దేవునిగూర్చి మనస్సాక్షి సాక్ష్యమిచ్చును.
2. సృష్టికర్తయు, ఆధారభూతుడునైన దేవునిగూర్చి సృష్టి బయలుపర్చును.
3. యేకమైన దేవునిగూర్చి దేవుని వాక్యము వివరించుచున్నది.
4. చరిత్రకు కారకుడగు దేవునిగూర్చి చరిత్రలో నెరవేరిన ప్రవచనములు చెప్పుచున్నవి.
5. నాయ్యాధిపతియైన దేవునిగూర్చి దేవుని ధర్మశాస్త్రమునకు విరోధముగా పాపము చేసి నాశనమైన వ్యక్తులవలన, రాజ్యములవలన సాక్ష్యము లివ్వబడుచున్నవి.
6. దేవుడు నమ్మదగినవాడని ఆయనయందు విశ్వాసముంచినవారి అనుభవములు చెప్పుచున్నవి.
7. పరిశుద్ధుడును, ప్రేమ స్వరూపియునైన దేవునిగూర్చి యేసుక్రీస్తు సంపూర్ణముగా బయలుపర్చెను.

ఇప్పుడు ముగించుచుండగా ఒక ప్రశ్న వేయగోరుదుము, దేవుడున్నాడను సిద్ధాం తము ఒకవేళ మీరు అంగీకరించినారు. కాని అది అంత తృప్తికరమైనది కాదు. అద్వి తీయ నిత్య దేవునిని ఆయన పంపిన యేసుక్రీస్తును యెరుగుటయే నిత్యజీవము. మరి నీవు ఆయనను ఎరుగుదువా?